ఐదేళ్ల నిరీక్షణకు మోక్షం!

- వినియోగంలోకి స్ట్రీట్ వెండర్స్ స్టాల్స్
- 45 మంది వీధి వ్యాపారులకు స్టాల్స్ కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న చిరు వ్యాపారులు


స్టాల్స్ కేటాయింపు పత్రాలతో లబ్ధిదారులు (ఫైల్)

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, గత పాలకవర్గం పలుచోట్ల సుమారు రూ.1.13 కోట్లతో స్ట్రీట్ వెండర్స్ స్టాల్స్ నిర్మించింది. గత ఐదేళ్లగా వీటిని పలు కారణాలతో ఎవరికీ కేటాయించలేదు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా నిరుపయోగంగా ఉన్న స్ట్రీట్ వెండర్స్ స్టాల్స్‌ను కమిషనర్ త్రిలేశ్వర్‌రావు చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది.

తరచుగా ట్రాఫిక్ సమస్యలు..

నగరపాలక సంస్థలోని కాలనీలల్లో రోడ్లపై వారాంతపు సంతలు నిర్వహించడంతో ఆయా కాలనీల్లోని ప్రధాన రహదారులపై తరచుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండేవి. దీంతో వాహనదారులు, పాదచారులు, అత్యవసర సేవల వాహనాలు ట్రాఫిక్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ అవస్థలను పరిగణలోకి తీసుకుని చిరు వ్యాపారులకోసం నగరంలోని 6 చోట్ల నిర్మాణానికి ప్రభుత్వం అమోదం తెలిపింది.

లబ్ధిదారులకు కేటాయింపులు..

బుద్ధానగర్‌లో 17.85 లక్షలతో 15స్టాల్స్, పీర్జాదిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రూ.20 లక్షలతో 16స్టాల్స్, బుద్ధానగర్ ఎస్టీఓ ఆఫీస్ వద్ద రూ.30 లక్షలతో 56 స్టాల్స్, మసీద్‌రోడ్డు వద్ద రూ.10 లక్షలతో 3 స్టాల్స్, పర్వతాపూర్ అరోరా కళాశాల వద్ద రూ.15లక్షలతో 13 స్టాళ్లను నిర్మించారు. అయితే గత కొన్నేళ్ల క్రితం స్టాళ్లు నిర్మించినా.. ఉపయోగంలోకి రాలేదు.

☛ తాజాగా రాష్ట్రప్రభుత్వం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పీర్జాదిగూడ నగర మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకుని నగర పాలక ప్రత్యేక అధికారి సత్యనారాయణ ఆమోదంతో 6,12,22 వార్డుల్లో నిర్మించిన స్ట్రీట్ వెండర్ స్టాల్స్‌ను పునరుద్ధరించారు. 45 స్టాళ్లను అర్హుల దరఖాస్తులను గుర్తించి 12న పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.

స్వచ్ఛ పీర్జాదిగూడే లక్ష్యం



స్వచ్ఛ పీర్జాదిగూడే లక్ష్యంగా 100 రోజుల ప్రణాళికలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. పరిశుభ్రతలో భాగంగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులు, నగర ప్రజలకు అనుగుణంగా ప్రత్యేకంగా స్ట్రీట్ వెండర్స్ స్టాల్స్‌ను నిర్మించి కేటాయించాం. మిగిలిన స్టాల్స్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం.

– త్రిలేశ్వర్ రావు, పీర్జాదిగూడ కమిషనర్

డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలి


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల చర్లపల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా తన దృష్టికి వచ్చిన సమస్యలు, జరుగుతున్న అభివృద్ధి పనులపై జెడ్సీతో సమీక్షించారు. దీనిపై జెడ్సీ సానుకూలంగా స్పందించారన్నారు.

వైద్యసాయానికి చేయూత



మల్కాజిగిరి: ఓ వ్యక్తి వైద్యసాయం కోసం ఈస్ట్ ఆనంద్‌బాగ్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ చేయూతనందించారు. బీజేఆర్‌నగర్‌కు చెందిన నర్సింహ గత కొంత కాలంగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కాగా తెల్ల రేషన్‌కార్డు (ఎఫ్ఎస్‌సీ) లేకపోవడంతో కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా.. ఉప్పల్ ఏఎస్‌ఓతో మాట్లాడి రేషన్‌కార్డు మంజూరు చేయించారు. సత్యనారాయణ, బ్రహ్మయ్య, రాము, రామకృష్ణ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఓపెన్‌జిమ్‌లో వ్యాయామం చేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ థీమ్‌పార్కులో రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌ను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓపెన్ జిమ్ మార్నింగ్ వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక నేతలు నెమలి రవి, యాదగిరిగౌడ్, దయాకర్‌రెడ్డి, అల్లాడి కృష్ణయాదవ్, పద్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉస్మాన్, శ్రీనివాస్‌రావు, బుసాని రఘు, చిన్న దుర్గయ్య, రఘు, రాపోలు శ్రీను తదితరులున్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి


సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. వేంకటేశ్వరనగర్‌లో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో యూజీడీ, తాగునీటి పైపులైన్లు పూర్తయిన తర్వాత సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నిర్మాణ సమయంలో నాణ్యత పాటించేలా చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ విభాగం అధికారులపై ఉందన్నారు. కాలనీవాసులు రోజారమణి, అంజనేయులు, బాలాజీ తదితరులున్నారు.

తెలంగాణ మెడికల్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు


నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఆవిర్భావ వేడుకల్లో ఉద్యోగులు

మల్లాపూర్: తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ నేతలు మాట్లాడుతూ.. యూనియన్ వైద్యరంగంలోని ఉద్యోగుల కోసం పోరాటాలు చేస్తుందన్నారు. ఉద్యోగుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నాచారం ఈఎస్ఐ బ్రాంచ్ సెక్రటరీ వేణుకుమార్, భాగ్యలక్ష్మి, రాజామణి, ధన్‌రామ్, భాగ్య, సౌందర్య, జామియాకుమార్, రాఘవేందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట' అవగాహన ర్యాలీ




అక్షరాభ్యాసం చేయిస్తున్న కార్పొరేటర్ శాంతి

రామంతాపూర్ : హబ్సిగూడ డివిజన్ రామంతాపూర్ పరిధిలోని వెంకటరెడ్డినగర్‌లో నిర్వహించిన 'అమ్మ మాట– అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన ఉప్పల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌పటేల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను కొత్త ఆలోచన విధానంతో ప్లే స్కూల్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా పిల్లలకు గుడ్లు, బెల్లం పట్టీలు వంటి పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. అంగన్‌వాడీ అధికారి స్వాతి, సూపర్‌వైజర్ కవిత, ఇందిరమ్మ కమిటీ మెంబర్ ఆకుల సురేష్‌బాబు, కిషోర్, సుమిత్ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం..

మల్లాపూర్: నాచారం ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మ మాట, అంగన్‌వాడీ బాట' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ విద్యార్థులకు నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ హాజరై అక్షరభ్యాసం చేయించారు. ఆమె మాట్లాడుతూ.. 2 ఏళ్ల నుంచి 5 ఏళ్ల పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని సూచించారు. ఉచితంగా యూనిఫామ్స్, అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు ఆటపాటలతో చదువు చెబుతారన్నారు. అల్వాల్ సీడీపీఓ స్వాతి, ఉప్పల్ సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటరమణ, చైతన్య, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

'అవినీతి లేని సుస్థిర పాలన'


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి



రామంతాపూర్ : ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్లుగా అవినీతి లేకుండా దేశ ప్రజలకు సుస్థిర పాలన అందిస్తున్నారని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి మేడ్చల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్‌తో పాటు కార్పొరేటర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధానిమోదీ 11 ఏళ్ళ పాలనపై దేశ వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, నేతలు జూలై 5 నుంచి ఆగస్టు 5 వరకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని, అందులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో కూడా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆమె కార్యకర్తలను కోరారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా, సెన్సార్ బోర్డు మెంబర్ జగదీష్‌పటేల్, రేవు నరసింహ, నారాయణ, దాస్, స్వర్ణ షిండే, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్: ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనను కేంద్ర పథకాలను వివరిస్తూ.. బీజేపీ నేతలు మంగళవారం గౌతంనగర్ డివిజన్ దయానంద్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌ముదిరాజ్, సీనియర్ నాయకులు ఘన, రాకేష్, ప్రకాష్, బలరాం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సహకారంతోనే అభివృద్ధి

మౌలాలి: మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతోనే మౌలాలి డివిజన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆమె డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కార్పొరేటర్, జీహెచ్ఎంసీతో పాటు ఎంపీ నిధులేనన్నారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తన సహకారంతోనే జరుగుతున్నాయన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హనుమ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వాసవనగర్ ప్రాంతానికి చెందిన దుస్స నవీన్‌కుమార్ (24) ఎంసీఏ చదువుతున్నాడు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా కుమారుడి కోసం తల్లి ఓ కిడ్నీ సైతం దానం చేసింది. అయినా ఆరోగ్యం కుదుట పడలేదు. దీంతో విరక్తి చెంది ఇంట్లో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోల్ తక్కువొచ్చిందని ఆందోళన!

ఉప్పల్: ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ తక్కువ పోస్తున్నారని ఆరోపిస్తూ.. వినియాగదారులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తన వాహనంలో పెట్రోల్ అయిపోగా.. ప్లాస్టిక్ బాటిల్స్ తీసుకుని వచ్చి రూ.100 పెట్రోల్ పోయమన్నాడు. మరో బాటిల్‌లో కూడా అంతే రూ.100 పెట్రోల్ పోయించుకోవడంతో రెండో దానిలో పెట్రోల్ తక్కువగా వచ్చింది. ఒకే తరహా బాటిల్స్ వేరు వేరుగా పెట్రోల్ పోస్తే.. ఓ దాంట్లో తక్కువ, మరో దాంట్లో ఎక్కువ ఎలా వస్తుందని ప్రశ్నించడంతో అక్కడి సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అక్కడికి వచ్చిన వాహనదారులు తోడవ్వడంతో ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఉప్పల్ సివిల్ సప్లై అధికారి సంధ్య ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించింది. లీగల్ మెట్రాలజీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా వచ్చి తనిఖీలు నిర్వహించనున్నారని, అంత వరకు వివాదంగా మారిన యూనిట్‌ను సివిల్ సప్లై అధికారి సీజ్ చేశారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందజేత


విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి హాజరై నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారని, పాఠశాలలో పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, కంప్యూటర్ శిక్షణ, వ్యక్తిగత పర్యవేక్షణ, ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో చైన్ స్నాచర్స్..

వృద్ధురాలి మెడలోని 4 తులాల బంగారం చోరీ

ఉప్పల్: ఉప్పల్ నుంచి తొర్రూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ వృద్ధురాలిని దృష్టి మరల్చి మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కెళ్లి పరారైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్ కట్రాల ప్రాంతానికి చెందిన ఆగమ్మ(65) బంధువులతో కలిసి ఉప్పల్‌లో ఓ శుభకార్యానికి వచ్చింది. తిరుగు ప్రయాణంలో తొర్రూర్ వెళ్లేందుకు ఉప్పల్ రింగ్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఫిర్జాదిగూడ కమాన్ వద్దకు చేరుకోగానే మెడలోని పుస్తెలతాడు కనిపించలేదు. దీంతో 100కు ఫోన్ చేస్తే మేడిపల్లి వద్ద పోలీసులు బస్సును ఆపి తనిఖీలు చేశారు. అప్పటికే నిందితులు పరారైనట్లు గుర్తించారు. ముగ్గురు మహిళలు తన వద్దకు వచ్చినట్లు బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ వ్యాధి గ్రస్తుల గుర్తింపు శిబిరం

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తుల గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మంగళవారం అయోధ్యనగర్ పల్లె దవాఖానాలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి చేతుల మీదుగా ప్రారంభించారు. బీపీ, షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి తెలిపారు. నిర్ధారణ అయితే మందులు కుషాయిగూడ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. డాక్టర్ విజయరాణి, బీజేపీ నేతలు మహేందర్‌రెడ్డి, పల్లె దవాఖానా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు కృషి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హిందూ శ్మశానవాటిక సమస్యపై కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అభ్యర్థన మేరకు మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ పలువురు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తామని, కొత్త బోర్‌వెల్ నిర్మాణం, బాత్‌రూమ్‌ల పునర్నిర్మాణం, దహన సంస్కారాల వేదికల పునర్నిర్మాణం, ఫ్లోరింగ్, పచ్చదనం అభివృద్ధి తదితర అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం సమస్యలపై స్థానికవాసులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు..

తహసీల్దార్ ఎదుట బైండోవర్

కుషాయిగూడ: ఓ భూ వివాదంలో చంపుతానంటూ.. బెదిరింపులకు పాల్పడిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడకు చెందిన సప్పిడి వెంకట్‌రెడ్డి, నాగారానికి చెందిన గూడూరు మహేష్‌గౌడ్, అతడి సోదరులకు భూ వివాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో సప్పిడి వెంకట్‌రెడ్డి, గూడూరు మహేష్‌గౌడ్‌లు గత ఏప్రిల్ 23న ఓ గార్డెన్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌లో తారసపడ్డారు. ఫంక్షన్ నడుస్తున్న సమయంలో 'మహేష్‌గౌడ్, సప్పిడి వెంకట్‌రెడ్డిని చంపేస్తానంటూ.. పలుమార్లు ప్రస్తావించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీనిపై వెంకట్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు కోర్టు అనుమతితో అదే నెల 28న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వారి విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో నిందితుడిని కాప్రా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


కేంద్రమంత్రి జయంత్ చౌదరితో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గానికి సంబంధించిన విద్యా ప్రాధాన్యతలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి మంత్రి జయంత్ చౌదరిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, వాజ్‌పేయినగర్‌లోని డిగ్రీ కళాశాలలో రూసా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకంతో ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభగల విద్యార్థులకు నాణ్యమైన, రెసిడెన్షియల్ విద్యను అందించవచ్చన్నారు. పీఎంఎస్‌హెచ్ఆర్ఐ పథకం కింద మల్కాజిగిరిలోని అన్ని అర్హత కలిగిన పాఠశాలలను చేర్చాలని కోరారు. అల్వాల్‌లోని ఐటీఐ కళాశాలలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించి సాంకేతిక విద్యను బలోపేతం చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో..

మౌలాలి: ఎమ్మెల్యే జన్మదిన వేడుకలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. మౌలాలి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అమీనుద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల మధ్య ఆయన కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆప్యాయంగా కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అరుంధతీ ఆసుపత్రితో ఎంతో మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తూ.. వేలమంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నారని పలువురు ప్రశంసించారు. భాగ్యనందరావు, సాదిక్, ఆదినారాయణ, సంతోష్‌నాయుడు, వంశీముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సంతోష్ గుప్తా తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ పూలపల్లి బాలయ్యనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాలయ్య కాలనీ, ఎన్‌బీహెచ్ కాలనీ పరిధిలో 11 కేవీ ఆకుల నర్సింగరావునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు అనంతసరస్వతీనగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

గౌతంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ రాజానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వెంకటాద్రినగర్, రాజానగర్, హనుమాన్ టెంపుల్ ఏరియా, పీవీఎస్‌కాలనీ పరిధి, ఓల్డ్ మీర్జాలగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మీర్జాలగూడ, లింగారెడ్డినగర్, బ్యాంక్‌కాలనీ, సంతోష్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కళ్యాణ్ తెలిపారు.

మల్లాపూర్: నాచారం ఇండోర్ కాకతీయ కర్షక్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కార్తికేయ ఫీడర్, విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. కౌండిన్యనగర్, వీరారెడ్డినగర్, నాచారం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. 11కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్డు, రవీంద్రనగర్, వీరారెడ్డినగర్, అంబేడ్కర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. 11 కేవీ రాంరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దుర్గానగర్, బాబానగర్, నాచారం విలేజ్, ఎర్రకుంట, కమాలాబాయినగర్, హనుమాన్‌నగర్, రాంరెడ్డినగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, శ్రీరామ్‌నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుషాయిగూడ: కుషాయిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా జైజవాన్ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదర్శనగర్, జీఆర్‌రెడ్డినగర్, దేవీనగర్, జై జవాన్‌కాలనీ, మారుతీనగర్, శ్రీనివాసనగర్, సాకేత్ టవర్స్, తిరుమల హార్మోని, అశోక్ మనోజ్ ఎన్‌క్లేవ్, రాజరాజేశ్వరికాలనీ, ల్యాండ్‌మార్క్, జ్యోతి బిల్డర్స్, ఫిల్‌హోమ్స్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ, విద్యామారుతీకాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, వీఆర్‌నగర్ కాలనీల్లోని పార్కులను ఆమె పరిశీలించారు. పార్కుల్లో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన వసతులు, అభివృద్ధిపై ఆమె అధికారులతో సమీక్షించారు. ఆహ్లాదాన్ని పంచే పార్కుల్లో పచ్చదనం నింపే దిశగా కార్యచరణ చేయాలని సూచించారు. దశలవారీగా అన్ని పార్కులను అభివృద్ధి చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. యూబీడీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లోకేష్‌కుమార్, నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్ తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం


రాములమ్మ


మహేందర్

మల్కాజిగిరి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురి కాలనీకి చెందిన పల్లపు రాములమ్మ(48), నర్సింహ భార్యాభర్తలు. కాగా ఈనెల 16న భార్యాభర్తలు కుటుంబ విషయంలో గొడవపడ్డారు. అదేరోజు మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై కుమారుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

పీవీఎస్ కాలనీకి చెందిన పుట్టా మహేందర్ (31) ప్రైవేట్ ఉద్యోగి. కాగా ఈనెల 14న ఇంటి నుంచి ల్యాప్‌టాప్‌తో వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఈ ఘటనపై మంగళవారం అతడి సోదరుడు రాజేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించండి

ఉప్పల్: వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే తగిన చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ వివిధ విభాగాల అధికారులకు సూచించారు. మాన్‌సూన్ దృష్ట్యా ఆయా సర్కిళ్ల పరిధిలో లో లేయింగ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని విభాగాల అధికారులు ఒకరికొకరు సహకరించుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైడ్రా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ట్రాఫిక్, జలమండలి అధికారుల నుంచి ఫిర్యాదులు వచ్చినా.. వెంటనే స్పందించాలని సూచనలు చేశారు. ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, కాప్రా సర్కిల్ డీసీ జగన్, హయాత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య, ఎల్‌బీనగర్ డీసీ, సరూర్‌నగర్ డీసీ సుజాతతో కలిసి ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో జెడ్సీ సమీక్ష సమావేశం నిర్వహించారు.